క్లుప్తంగా...

చిలువేరు రఘురాంకు కీర్తి పురస్కారం



రఘురాంకు పురస్కారం అందజేస్తున్న ఆచార్య తంగెడ కిషన్ రావు

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2020వ సంవత్సరానికిగాను పైడి లక్ష్మయ్య స్మారక కీర్తి పురస్కారాన్ని మంగళవారం ఎన్టీఆర్ కళా మందిరంలో ఏర్పాటు చేసిన విద్యా ఉత్సవాల వేదికపై ఉత్తమ నాటక రచయిత విభాగంలో ప్రముఖ నాటక రచయిత చిలువేరు రఘురాంకు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్ రావు, రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ అందజేశారు. అయిదు దశాబ్దాలుగా ఖైదీ, తత్కాల్, యజ్ఞం, పద్మవ్యూహం, కొత్త మలుపు వంటి నాటకాలను రచించి ఆ రంగానికి రఘురాం విశేషమైన సేవలందించారు. ఇంటర్ బోర్డు సంయుక్త కార్యదర్శి హోదాలో పదవీ విరమణ పొందిన ఆయన ప్రస్తుతం సెన్సార్ బోర్డు సభ్యులుగా పనిచేస్తున్నారు.

అభినందన ఎన్టీఆర్ అవార్డుల ప్రదానం



మురళీ మోహన్, డాక్టర్ జయచిత్రలను అవార్డులతో సత్కరిస్తున్న దృశ్యం

నాంపల్లి: పద్మశ్రీ నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పబ్లిక్‌గార్డెన్స్‌లోని తెలుగు వర్సిటీ ఎన్టీఆర్ కళా మందిరంలో అభినందన ఎన్టీఆర్ అవార్డుల ప్రదానోత్సవ సభ జరిగింది. అభినందన సంస్థ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మాత, ప్రముఖ నటుడు మురళీమోహన్, ప్రముఖ నటి, కళాజ్యోతి డాక్టర్ జయచిత్రకు అభినందన ఎన్టీఆర్ అవార్డులను అందజేసి సత్కరించారు. సభా ప్రారంభంలో సరిలేరు నీకెవ్వరు శీర్షికన ఎన్టీఆర్ పౌరాణిక సినీ గీతాల విభావరి జరిగింది. నంది అవార్డు గ్రహీత సురేఖామూర్తి, అభినవ ఘంటసాల డీఏ మిత్ర ఆలపించిన ఆ పాత మధురాలు అలరించాయి. అలాగే బేబి మహిష్మతి కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమాన్ని అభినందన వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ భవాని సమన్వయం చేశారు.

కనుల పండువగా జగన్నాథ రథయాత్ర



చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలో మంగళవారం శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర కనుల పండువగా కొనసాగింది. శ్రీ జగన్నాథుడు, సుభద్రాదేవి, బలబద్రులను భారీ రథంపై ప్రతిష్ఠించి ఊరేగింపు నిర్వహించారు. అంతకు ముందు జగన్నాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, యజ్ఞం, పూర్ణాహుతిలను నిర్వహించారు. ఈ రథయాత్రను కాశీ పీఠాధిపతి రామానుజాచార్య రిగ్వేదాచార్యజీ ప్రారంభించారు. నిర్వాహకులు దామోదర్ దాస్ గోవింద్ కుమార్ లోహియా, గులాబ్‌రాయ్ కాంతిలాల్, రామకృష్ణ ముదిరాజ్ తదితరుల ఆధ్వర్యంలో కొనసాగిన ఈ ఊరేగింపులో చార్మినార్ ఏసీపీ రుద్ర భాస్కర్, చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ ఎం.ఎ.జావిద్, ఎస్సైలు పోచయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలి



చార్మినార్: మైనార్టీ విద్యాలయాల ద్వారా అందజేస్తున్న గుణాత్మకమైన విద్యను మైనార్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అర్చన అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సంతోష్‌నగర్‌లోని ఐఎస్‌సదన్ వద్ద ఉన్న టీఎంఆర్ఎస్‌జేసీలో విద్యా దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ఏడాది టీఎంఆర్ఎస్‌జేసీలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులను సన్మానించారు.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడిన ఇద్దరికి జైలు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు యువకులకు న్యాయస్థానం మూడు రోజుల జైలు శిక్షను విధించింది. ఇన్‌స్పెక్టర్ ఎం.ఎ.జావిద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడకు చెందిన పగిడాల స్వామి(35), కె.బాబు(21)లు స్థానికంగా బహిరంగ ప్రదేశాలలో యువతులను వేధిస్తున్నారు. పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టడంతో 9వ స్పెషల్ మెట్రోపాలిటన్ న్యాయస్థానం ఇద్దరికి మూడు రోజులు జైలు శిక్షను విధించింది.

బోనాల ఉత్సవాలకు

లంగర్ ఖానా సిద్ధం

రేపటి నుంచి ప్రారంభం

- నెల రోజుల పాటు పూజలు అందుకునే అమ్మవారి బోనాలు నిర్వహించడం లంగర్‌హౌస్ వాసుల అదృష్టం
- అప్పటి హైదరాబాద్ దేశం నుంచి కొనసాగుతున్న ఆనవాయితి
- నజర్ బోనం (తొలి బోనం), తొట్టెల ఊరేగింపు లంగర్‌హౌస్ నుంచి గోల్కొండకు..



పోతరాజుల విన్యాసాలు(ఫైల్)

లంగర్‌హౌస్: ఈనెల 22 నుంచి బోనాల వేడకలు ప్రారంభం కానుంది. ఈ వేడుకలకు లంగర్‌హౌస్ గోల్కొండలు వేదిక కానున్నాయి. నెల రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా నిర్వహించే అమ్మవారి బోనాల ఉత్సవాలు గోల్కొండ కోటలో ప్రారంభమయ్యి, చివరి బోనాలు కూడా ఇక్కడే ముగించడం ఆచారం. ఆషాఢ మాసం ప్రారంభం అమావాస్య తరువాత వచ్చే మొదటి గురువారం లేదా ఆదివారాల్లో బోనాల ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. గోల్కొండ కోటపై వెలసిన జగదాంబికా అమ్మవారికి మొదటి పూజ నిర్వహించి నెల రోజుల పాటు ప్రతి గురు, ఆది వారాల్లో 9 పూజలు నిర్వహిస్తారు. లంగర్‌హౌస్ వాసుల చేతుల మీదుగా ఈ బోనాల ఉత్సవాలు నిర్వహించే ఆనవాయితీ వందల సంవత్సరాల నుంచి కొనసాగుతుంది.

నజర్‌బోనంతో ప్రారంభం..

తెలంగాణ బోనాల ఉత్సవాలు ఈనెల 22వ తేదీ గురువారం ప్రారంభం కానున్నాయి. గోల్కొండ జగదాంబిక అమ్మవారికి ప్రథమ పూజ నిర్వహించడంతో బోనాల సంబరాలు ప్రారంభం అవుతాయి. మొదటి పూజలో భాగంగా అమ్మవారికి మొదటి నజర్ బోనం సమర్పించనున్నారు. 32 అడుగుల ఎత్తైన భారీ తొట్టెలను కూడా మొదటి పూజలో సమర్పించనున్నారు. గురువారం లంగర్‌హౌస్ చౌరస్తా నుంచి భారీ ఊరేగింపుతో గోల్కొండ కోటకు నజర్ బోనం, తొట్టెల తీసుకెళ్లనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ప్రారంభమయ్యే ఊరేగింపు రాత్రి 8 గంటలకు కోటపై ఉన్న అమ్మవారి ఆలయానికి చేరుకోనుంది.



అమ్మవారి ఉత్సవమూర్తి, నగలు, పల్లకీ సేవ(ఫైల్)

పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రులు..

గురువారం బోనాల పండుగ ప్రారంభం సందర్భంగా లంగర్‌హౌస్‌లో ప్రారంభమ్యే ఊరేగింపులో మంత్రులు, ప్రముఖులు పాల్గొననున్నారు. ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలను మంత్రులు లంగర్‌హౌస్‌లో సమర్పించి ఊరేగింపును ప్రారంభిస్తారు. మధ్యాహ్నం తరువాత చోటాబజార్‌కు ఊరేగింపు చేరుకోగా సాయంత్రం 4 గంటలకు అక్కడ ప్రధాన పూజారి ఇంట్లో అమ్మవారి ఉత్సవమూర్తికి, నగలకు పూజలు నిర్వహించనున్నారు. అక్కడి నుంచి బోనాలతో అమ్మవారిని పల్లకిలో ఊరేగించి కోటపై కొలువుదీరిన అమ్మవారి ఆలయంలో ప్రతిష్ఠించడంతో మొదటి పూజ ముగియనుంది. అమ్మవారిని నగలతో అలంకరించి, తొలిబోనం సమర్పిస్తారు.

బోనాలు నిర్వహించే అదృష్టం లంగర్‌హౌస్ వాసులదే..

తెలంగాణ బోనాల ఉత్సవాలు నిర్వహించే గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాలు నిర్వహించే అదృష్టం కేవలం లంగర్‌హౌస్ వాసులకే దక్కుతుంది. కాకతీయులు, తానీషాల కాలం నుంచి కూడా అమ్మవారికి పూజలు, బోనాలు నిర్వహించే బాధ్యత లంగర్‌హౌస్ వాసుల చేతుల మీదుగా చేసే ఆనవాయితీ కొనసాగుతుంది.

తొలి బోనం విశిష్టత...

లంగర్‌హౌస్ ప్రాంతాన్ని గతంలో లంగర్‌ఖానా అని కూడా పిలిచేవారు. లంగర్ అనగా వంట ఖానా అనగా గది. ఈ ప్రాంతంలో ఆనాడు వంట గదులు గతంలో ఉండేవి. ఆహార ధాన్యాలను ఇక్కడి బాండారాల్లో దాచి పెట్టి రాజులకు, సైనికులకు ఆహారాన్ని లంగర్‌హౌస్‌లోనే వండి పంపించేవారు. అమ్మవారి నైవేద్యాన్ని కూడా ఇక్కడి నుంచే వండి కోటపై ఉన్న అమ్మవారికి పంపించడంతో బోనాలను లంగర్‌హౌస్ వాసులు నిర్వహించే ఆనవాయితీ కొనసాగుతుంది.

క్యూలైన్లలో మార్పులు..



గోల్కొండ బోనాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పూర్తి స్థాయి మార్పులతో ఈ సంవత్సరం ఏర్పాట్లు చేస్తున్నాం. బోనాలు ఎత్తుకొని వచ్చే భక్తుల కోసం వేరొక క్యూలైను, భక్తులకు వెడల్పు క్యూలైన్లు మార్పులతో ఏర్పాటు చేస్తున్నాం. తాగునీరు, వైద్య సిబ్బందితో పాటు తమ కార్యకర్తలు దారిపొడువున ఉండి భక్తులకు సేవలు అందించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ కనీవినీ ఎరగని రీతిలో బోనాల ఉత్సవాల పండుగ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. – జగదీష్‌యాదవ్, గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్

సామూహిక తొట్టెల సమర్పణ..

మొదటి బోనం తరువాత భక్తులు లక్షల సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించే రోజుకు మరో ప్రత్యేకత ఉంది. నాల్గవ పూజ జూలై 2వ తేదీ సామూహిక బోనాల సమర్పణ, తొట్టెలల ఊరేగింపు నిర్వహించనున్నారు. నగరంలోని ప్రధాన ఆలయాలైన సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి, మీరాలం మండి అమ్మవారు, లాల్ దర్వాజ అమ్మవార్లతో పాటు వివిధ ఆలయాల నుంచి దాదాపు 100కు పైగా తొట్టెల సామూహిక ఊరేగింపు నిర్వహించనున్నారు. ఈ ఆలయాల నుంచి నిర్వాహకులు తమ తొట్టెలలు , బోనాలు ఆగస్టు 2వ తేదీ ఉదయం 11 గంటలకు లంగర్‌హౌస్‌కు తీసుకురానున్నారు. ఇక్కడి నుంచి వైభవంగా సామూహిక తొట్టెలల ఊరేగింపు కొనసాగుతుంది.

బోనాలకు కోటలో ముమ్మర ఏర్పాట్లు



ముస్తాబయిన కోటలోని నాగదేవత పుట్ట

గోల్కొండ: ఆషాఢమాసపు బోనాలకు గోల్కొండ కోట ముస్తాబవుతుంది. శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరాజు పర్యవేక్షణలో అమ్మవారి ఆలయానికి అందంగా అలంకరించారు. మరోవైపు కోటలోని నగీనా బాగ్ ఎగువ భాగంలో నాగదేవత పుట్టను ముస్తాబు చేశారు. కోటకు వచ్చే భక్తులు మొదటగా నాగదేవత పుట్ట వద్ద పూజలు నిర్వహించి కోటపై భాగంలో గల అమ్మవారి ఆలయానికి బయలుదేరి వెళ్తారు. మరోవైపు ఆలయ పునరుద్ధరణ కమిటీ ప్రతినిధులు కోటలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. కోట మెయిన్ గేటు వద్ద స్వాగత ద్వారం ఏర్పాటు పూర్తయింది. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు క్యూ లైన్‌లలో తొక్కిసలాట జరగకుండా ప్రత్యేక బారికేడ్లు చకచక జరుగుతున్నాయి.

వేతనాలు చెల్లించండి

గన్‌ఫౌండ్రీ: నిజాం కళాశాలలో విధులు నిర్వహిస్తున్న నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని ఉద్యోగులు మంగళవారం కళాశాల ఎదుట ఆందోళనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ.. నాలుగు నెలలుగా కాంట్రాక్ట్ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తమకు వేతనాలు చెల్లించాలని లేనియెడలా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

మెగా హెల్త్ క్యాంపు ప్రారంభం



మెగా హెల్త్ క్యాంపును ప్రారంభిస్తున్న డీహెచ్ శ్రీనివాస్‌రావు

సుల్తాన్‌బజార్: తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ చేస్తున్న సేవలు అభినందనీయమని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం కోఠి డీఎంహెచ్ఎస్ ప్రాంగణంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంఘం అధ్యక్షురాలు శశిశ్రీ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీహెచ్ డాక్టర్ శ్రీనివాసరావు హాజరై హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ అసోసియేషన్ మహిళా ఉద్యోగుల ఆరోగ్యం పట్ల గైనిక్, బ్రెస్ట్ కేన్సర్ వ్యాధుల నిర్మూలన కోసం ఈ క్యాపు ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. సంఘం అధ్యక్షురాలు శశిశ్రీ మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగుల ఆరోగ్య భద్రత కోసం ఈ హెల్త్ క్యాంపును నిర్వహించడం జరిగిందన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయనిర్మల, కోశాధికారి స్ఫూర్తి, ఉపాధ్యక్షులు అనితారెడ్డి, నిర్మల, రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వాహకులు భీంరెడ్డి, కేన్సర్ స్పెలిస్ట్ డాక్టర్ ఆర్ముగం పాల్గొన్నారు.

బంజారా దర్వాజా వద్ద స్కై కేబుల్ ఏర్పాటు చేయాలి



గోల్కొండ: గోల్కొండ కోట బంజారా దర్వాజా వద్ద ట్రాఫిక్ రద్దీని నివారించడానికి ఆ ప్రాంతంలో వెంటనే స్కై కేబుల్‌ఏర్పాటు ఆవశ్యకతమని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి (మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేక కార్యదర్శి) అరవింద్ కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన గోల్కొండ బంజారా దర్వాజా వద్ద స్కై కేబుల్, నైట్ బజార్ ఏర్పాటుపై చర్చించారు. ఇక్కడ ట్రాఫిక్ రద్దీని నియంత్రించడానికి స్కై కేబుల్ పనులు వెంటనే ప్రారంభించాలని ఆయన కోరారు. అదే విధంగా బంజారా దర్వాజా వద్ద నైట్ బజార్ ఏర్పాటు చేయాలని, ఈ విషయంపై గతంలో కూడా తాను విన్నవించానని ఆయన అన్నారు. స్కై కేబుల్ ఏర్పాటు, నైట్ బజార్ ఏర్పాటుకు సంబంధించిన ఫైల్ తన దగ్గర ఉందని, అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు అరవింద్ కుమార్ హామీ ఇచ్చారు.

ప్రభుత్వ పాఠశాలలను మరింత మెరుగుపరచాలి



పాఠశాల ప్రారంభోత్సవంలో కార్పొరేటర్ సురేఖ ఓంప్రకాష్, ఇన్‌చార్జ్ హెచ్ఎం అర్పిత

అబిడ్స్: ప్రభుత్వ పాఠశాలలను మరింత మెరుగుపరచాలని గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ సురేఖ ఓంప్రకాష్ పేర్కొన్నారు. చిరాగల్లీలోని చాదర్‌ఘాట్ కుచే స్కూల్‌ను ఆమె ప్రారంభోత్సవం చేశారు. ఇటీవల నూతన హంగులతో ఆధునికరించిన స్కూల్ భవనాన్ని మంగళవారం ఆమె ప్రారంభించి ప్రసంగించారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం, హాజరు శాతం కూడా పెరిగే విధంగా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. చాదర్‌ఘాట్ కుచే స్కూల్‌లో ప్రతి సంవత్సరం ఉత్తమ ఫలితాలు వచ్చే విధంగా ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అమోఘమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఐఓఎస్ సత్యవతి, ఇన్‌చార్జ్ హెచ్ఎం అర్పిత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

'విద్య ఒక్కటే అభివృద్ధి మంత్రం'

చార్మినార్: విద్య ఒక్కటే అభివృద్ధి మంత్రమని ప్రముఖ విద్యావేత్త, విశ్లేషకుడు డాక్టర్ అందె సత్యం అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వ సిటీ కళాశాలలో విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు విద్య అంటే పాండిత్యమేననుకున్నారు.. అదే విద్య లక్ష్యం అనుకున్నారు.. కానీ నేడు విద్య అంటే సంపద, ప్రగతి, శాస్త్ర సాంకేతిక, విద్యకు పేదరికానికి ప్రత్యక్ష సంబంధం ఉందన్నారు. విద్య గురించి మాట్లాడినప్పుడు జ్యోతిబా పూలే, సావిత్రీబాయి పూలేని తప్పనిసరిగా స్మరించుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో స్ఫూర్తివంతమైన పాత్ర పోషించిన సిటీ కళాశాల ఇవ్వాళ రాష్ట్రంలో విద్యార్థుల మొదటి ఎంపికగా ఉండటం అభినందనీయమన్నారు. సభకు అధ్యక్షతన వహించిన ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉన్నత విద్యా సంస్కరణలతో విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నారని.. రాష్ట్రం ఏర్పడిన తొమ్మిదేళ్లలోనే 14 కొత్త డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేశారన్నారు. ఈ సభలో డాక్టర్ యాదయ్య, డాక్టర్ రత్న ప్రభాకర్, డాక్టర్ కోటి కోటేశ్వర్‌రావు, సుమన, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థుల ఫ్లాష్‌మాబ్

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 8 గంటలకు అబిడ్స్‌లోని జనరల్ పోస్ట్ ఆఫీస్ వద్ద పాఠశాల విద్యార్థులు ఫ్లాష్‌మాబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 170 మంది పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారిణి రోహిణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



బ్రోచర్లను విడుదల చేస్తున్న బీజేపీ ఇన్‌చార్జ్ అమర్‌సింగ్

జియాగూడ: ప్రతి కార్యకర్త ఆయా పోలింగ్ కేంద్రం పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రధాని మోదీ చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించాలని కార్వాన్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జ్ అమర్‌సింగ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జియాగూడలో బూత్ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో కలిసి బ్రోచర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జియాగూడలో బీజేపీ ఎంతో పటిష్టతతో పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరీసెల్ కన్వీనర్ శివకుమార్‌యాదవ్, డివిజన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ్, మాజీ కార్పొరేటర్ మునేందర్, సీనియర్ నాయకులు దర్పల్లి నర్సిములు, రాకేష్, కిషన్ దామ, సంతోష్ పాల్గొన్నారు.

రెండు పుస్తకాల ఆవిష్కరణ



సాక్షి,సిటీబ్యూరో: ముఖ్యమంత్రి కేసీఆర్ పనితీరు, పాలనపై జర్నలిస్టుల బృందాలు ఇచ్చిన కథనాలతో ముద్రించిన రెండు పుస్తకాలను తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక, దేవాదాయ, యువజన, మీడియా వ్యవహారాల సలహాదారు, తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ డాక్టర్ కేవీ రమణాచారి మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ పుస్తకాలను చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో జనచైతన్య పబ్లికేషన్స్ ప్రచురించాయి. ఇందులో ఒక పుస్తకం సీనియర్ పాత్రికేయుడు నేలంటి మధు రాసిన 'దేశానికి దిక్సూచి కేసీఆర్' కాగా, రెండో పుస్తకం జర్నలిస్టులు రూపొందించిన 'ఉద్యమ నేత, సంక్షేమ ప్రదాత.'

సమాజ సేవకు నిరంతరం కృషి

అబిడ్స్: సమాజ సేవకు నిరంతరం కృషి చేస్తామని బీఎస్ఐ సభ్యుడు సంతోష్ పేర్కొన్నారు. సమాజ సేవ చేయడంతోనే మానసిక సంతోషం, మానసిక తృప్తి కలుగుతుందని ఆయన అన్నారు. స్ఫూర్తి ప్రభుత్వ హాస్టల్‌లో విద్యార్థులకు పండ్లతో పాటు పలు రకాల స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. సమాజ సేవ చేసేందుకు తామెప్పుడూ ముందుంటామన్నారు. ప్రతి సంవత్సరం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. తన కుమార్తె దీక్షి జన్మదినం సందర్భంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.



పండ్లు పంపిణీ చేస్తున్న బీఎస్ఐ సభ్యుడు సంతోష్ తదితరులు

విద్యార్థులకు అండగా గడ్డం గంగాధర్‌యాదవ్ ఫౌండేషన్



విద్యార్థులకు అడ్మిషన్ల కాపీలను అందజేసిన గడ్డం శ్రీనివాస్‌యాదవ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలోని విద్యార్థులకు అండగా గడ్డం గంగాధర్ యాదవ్ ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తుందని ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. నియోజకవర్గం పరిధిలోని సంజయ్‌నగర్ బస్తీ, మాలకుంట, గౌలిగూడతో పాటు పలు ప్రాంతాల ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు అడ్మిషన్ల పత్రాలను అందజేశారు. అనంతరం గడ్డం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలోని ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులందరికీ తన ఫౌండేషన్ ద్వారా ఉచితంగా విద్యను అందిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులకు ఫౌండేషన్ అన్ని విధాల అండగా ఉండి వారికి ఉచిత విద్యను బోధించడమే తన ధ్యేయమన్నారు. నియోజకవర్గం పరిధిలోని ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులు ఎవరైనా ఉచిత విద్య కావాలంటే తనను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ కళాశాలల సందర్శన



కళాశాలల్లో వసతుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న రాధిక జైస్వాల్

నాంపల్లి: తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్, న్యాయమూర్తి జస్టిస్ తుకారాంజీ ఆదేశాలతో మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సెషన్స్ జడ్జి ప్రేమావతి సూచనలతో మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ మంగళవారం నగరంలోని కొన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సందర్శించారు. అక్కడి పరిసరాలను, పరిశుభ్రతను, వసతులను పరిశీలించారు. మరుగుదొడ్ల సౌకర్యం, వెండింగ్ మిషన్స్ అందుబాటులో ఉన్నాయా లేదా అని ఆరా తీశారు. మరమ్మతుల్లో ఉన్న మరుగుదొడ్ల కళాశాలల యాజమాన్యాలకు వాటి మరమ్మతులను వెంటనే చేపట్టి నివేదికను అందజేయాలని ఆదేశించారు. అలాగే కళాశాలలోని ఉపాధ్యాయులతో, విద్యార్థులతో మాట్లాడి అక్కడ నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా కాచిగూడ గవర్నమెంట్ జూనియర్ కళాశాల, ఓల్డ్ గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ఫర్ బాయ్స్, మలక్‌పేట న్యూ గవర్నమెంట్ జూనియర్ కళాశాల ఫర్ గర్ల్స్, మహబూబియా గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ఫర్ గర్ల్స్, ఆలియా జూనియర్ కాలేజ్ ఫర్ భాయ్స్, చంచల్‌గూడ డిగ్రీ అండ్ జూనియర్ కాలేజ్ ఫర్ బాయ్స్ అండ్ గర్ల్స్, గవర్నమెంట్ సిటీ కాలేజ్, ఎంఏఎం జూనియర్ కాలేజ్, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్, ఒకేషనల్ కాలేజ్ నాంపల్లిని సందర్శించారు. అనంతరం నివేదికను తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డికి సమర్పించారు.

వైభవం.. మహాభిషేకం



108 కలశాలు, ఆయుర్వేద, సుగంధ ద్రవ్యాలు, దేవతా మూర్తులకు పూజలు

చార్మినార్: ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని మీరాలం మండి మహంకాళేశ్వర ఆలయంలో మంగళవారం మహంకాళేశ్వర పరివార సహిత మహంకాళేశ్వరి మహాభిషేకం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య-చంద్రకళ, కాట రమేష్ దంపతులు పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ కొడకండ్ల శ్రీరామ శరణ్ శర్మ, అలంకార బ్రహ్మశ్రీ శృంగారం ఆత్రేయాచార్లు నిర్వహణలో గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, ఆంజనేయ స్వామి, నవగ్రహ తదితర ప్రత్యేక అభిషేకం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 108 ఆయుర్వేద, సుగంధ ద్రవ్యాలు, పండ్లు, కలశాలతో అమ్మవారికి మహాభిషేకం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహాభిషేకం సందర్భంగా భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుంటా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో బేలా ముత్యాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు పాటేల్ సదానంద్ యాదవ్, కోటిరెడ్డి, పలువురు అధికార, అనధికార ప్రముఖులు పాల్గొన్నారు.



మహంకాళేశ్వర అమ్మవారికి మహాభిషేకంలో గాజుల అంజయ్య తదితరులు